# ఏసోబు హృదయం



గొల్లపూడి మారుతీరావు

బ్రిడ్జికి యింకా కోసెడు దూరం ఉందనగానే లారీ ఆపాడు ఏసోబు. పైరు మీదనుంచి వచ్చే పచ్చిగాలిని గుండె నిండా నింపుకున్నాడు. ఆ గాలి ఆ ప్రాంతాల్లోనే ఎక్కడో ఉండే పుల్లి శరీరం దాటివస్తుందని ఏసోబు నమ్మకం. ఆ రుచి అతనికి అలవాటయిన మత్తు. ఆరు రోజులనుంచి యిక్కడికి వచ్చి వాలిపోవాలని విలవిలలాడిపోయాడు. అహ్మదాబాదు ఆఘమేఘాలమీద చేరాక మామూలుగా తీసుకొనే ఒక రోజు విశ్రాంతి కూడా తీసుకోలేదు. పుల్లికి దూరంగా గడిపే క్షణాలన్నీ జీవితంలో వృధా అయిపోయినట్టే లెక్క ఏసోబుకి. పుల్లి అతని సర్వస్వం. అతని మంచి చెడ్డలన్నీ పుల్లికి బాగా తెలుసు. మరో అయిదారు నిముషాల్లో పుల్లి సమక్షంలో ఉంటాడు తను. మనస్సు ఆతృతతో ఉరకలు వేస్తోంది. రేడియేటర్‌లో నీళ్లు పోసి, వేడి చల్లార్చి లారీతో ముందుకి దూకేసాడు ఏసోబు.

* * *

బ్రిడ్జికి అటుపక్కగా కాలవ వెనక ఉన్న గన్నేరుచెట్ల చాటునుంచి ఏసోబుని, అతని లారీని గమనించింది పుల్లి. ఇంకా మాలకొండయ్య చేతులు నడుంచుట్టూ ఉండనే ఉన్నాయి. ఆవిర్లు వదిలే యింజను లాగ బుసలు కొడుతూ దెబ్బతిన్న ఖడ్గమృగంగా లాగా చెట్ల మధ్య యిసికలో పడుకొని ఉన్నాడు కొండయ్య. అహ్మదాబాద్‌లో మరో రోజయినా ఉండకుండా పరుగున ఏసోబు వస్తాడని తనకి తెలుసు. రాత్రికి రాత్రి లారీ సరుకు వదిలేసి "పుల్లీ! నువ్వు లేనిదే బతకలేనే! ఆ విషయం చెప్పడానికే వచ్చానే!" అని వచ్చి పాకలో వాలిపోయినా వాలిపోతాడు. అందుకని ఎప్పుడు మాలకొండయ్య కలిసినా కాలవ పక్కన ఈ గన్నేరు చెట్ల గుబురు నయం. అక్కడికి ఏసోబు లారీ గుర్తు తెలుస్తుంది. అక్కడికి వచ్చేసరికి లారీ వేడెక్కుతుంది. మనిషిలాగే దాన్ని చల్లార్చి యింటికి దూకేస్తాడు. విసుక్కుంది పుల్లి. అప్పుడే కొంపలు మునిగిపోయినట్టు దిగులుపడిపోయాడు ఏసోబు. ఈ ఆరు రోజులూ స్వర్గం అనుభవించింది. మాలకొండయ్య దూది ఏకుతాడు. చాలాకాలం లాహోరులో ఉండి మంచి ఒడుపు నేర్చుకున్నాడు. చెయ్యి వాటంగా వుంది. ఎప్పుడూఅటో యిటో తేల్చేసే మనిషి. మొదట పట్నంలోనే మసీదు పక్కన ఓ చిన్న కొట్టాంలో ఉండేవాడు.

కాని పుల్లి రుచిమరిగాక యిక్కడికి మారాడు. పొరపాటు. పుల్లే అతన్ని ఈ వూరుకి మార్చింది. ఏసోబు ఎప్పుడు రూటుమీద వెళ్తాడో పుల్లికి గుర్తే. మాలకొండయ్యకి కబురు వెళ్తుంది. అప్పటిదాకా దూది ఏకి ఏకి గోనెబస్తానే మీద పరుచుకొని గన్నేరుచెట్ల మధ్య విశ్రమిస్తాడు. ఏసోబు లారీ బ్రిడ్జి దాటగానే మాలకొండయ్య చేతుల్లో వాలిపోతుంది పుల్లి.

ఇప్పుడు ఇంక ఏసోబు దిగబడ్డాడు మరి నాలుగయిదు రోజులు ఆ వాన పాముతో బతుకు. "పుల్లీ పలుదోము పుల్ల కావాల."

"పుల్లీ తలకి నూనె."

"పుల్లీ చెయ్యికి దెబ్బ తగిలింది అంబలి నోటి కందియ్యవే."

"పుల్లీ నీ వొళ్లో తలెట్టి పడుకోవాలనుందే."

ఏసోబు చేసే గోముకి చిరాకెత్తిపోతుంది పుల్లికి. మగాడు మగాడుగ వుండాలి. పొగరుగా ఉండాలి. ముచ్చటకయినా ఎప్పుడూ పుల్లిని చాచి లెంపకాయ కొట్టలేదు ఏసోబు. అలాంటి ఆలోచనంటేనే అతనికి స్పృహ తప్పుతుంది.

విసుక్కుంటూ పుల్లి లేచింది.

ఏసోబు ఆనందంగా బొమ్మిడాయల మూట పట్టుకొని చేరేవేళకి, గజ్జెల

గుర్రంలాగ ఝుణ ఝుణ మంటూ వెనకనే గుడిసెలో ప్రవేశించింది పుల్లి.

పుల్లి చందమామలాగ కనిపించింది ఏసోబుకి. తడిసి చెమటలు కారుతున్న ఆ నుదుటిని చూసి "ఎంత శ్రమపడి పనిచేస్తోందో నాకోసం. నన్ను సుఖ పెట్టడం కోసం దానికీ కష్టాలు" అనుకొన్నాడు. నలిగిన చీరచూసి అంచు సరిచేసి "పాచిపనిచెయ్యొద్దంటేవినదు. నా సంపాదనతో పుల్లిని నెత్తిమీదెట్టుకొని పూజించనూ. అది యిలా నలిగిపోతే చూడలేను." అని కన్నీళ్లెట్టుకున్నాడు.

పుల్లి— అతని చేతిలో చీరెని విడిపించుకొంది. బొమ్మిడాయలు మూట అందుకొంది.దాహంగొంతునిపీకేస్తోంది. కుండ మూతతీసి చెంబుతో నీళ్ళు ముంచింది. వెనకనుంచే వచ్చి చీరకీ, జాకెట్టుకీ మధ్య వీపుమీద ముద్దెట్టుకున్నాడు. గన్నేరు ఆకులు నలిగిన వాసన, మట్టి పెదాలకి తగిలాయి. ఏసోబుకి వొళ్లు ఝుల్లు మంది. పుల్లికి మెడమీద చెమటలు పోశాయి. అదేచోట గంటకిందట మాల కొండయ్య పళ్లు నాటేలా కొరికాడు.

పుల్లి వొళ్లు ఝుల్లుమంది. ఆమె పులకరింతకి మురిసిపోయాడు ఏసోబు.

"త్వరగా అన్నం ఎట్టవే— నీ చేతుల్తో వడ్డించుకు తినాలని ఆకలిని పొద్దుట్నుంచీ మిగుల్చుకువచ్చాను," అన్నాడు గారాబంగా.

"జంక్షన్ దగ్గర యింత ఎంగిలి పడలేకపోయావా? రాగానే ఆకలంటావు. అన్నిటికీ తొందరే, కదులు." అందిపుల్లి అదేదో వలవు ఝుళిపింపులాగ కిచకిచ నవ్వాడు ఏసోబు.

తన జీవితంలో గొప్ప అదృష్టాల్లో ఒకటి పుల్లి తన పెళ్లాం కావడం అనుకొంటూ, షర్టుతీసి స్నానానికి సిద్ధమయాడు ఏసోబు.

* * *

ఈ భూమ్మీద పడ్డ అయిదారు నెలల దాకా ఏసోబు బతుకుతాడో చస్తాడో తేల్చుకోలేకపోయింది వాళ్లమ్మ నూకాలు. ఎముకలన్నీ పోగుపోసినట్టు ఉండేవాడు. వాటి మధ్య ఎక్కడో గుహల్లో వెలిగించే దీపాల్లాగ రెండు పెద్దకళ్ళు. జబ్బేమిటో తెలీదు. పక్షిదోషం పట్టినవాడిలాగ వుండేవాడు. రోజుకి 24 గంటల్లో ఏ నాలుగు గంటలో తప్ప 20 గంటలూ ఏడుస్తూండేవాడు. ఆ ఏడుపు మూలుగులాగ ఆ మూలుగుకీ ఓపికలేనట్టు కనిపించేవాడు. పనిచేసుకోడానికి వెళ్లి తిరిగొచ్చాక వాడు యింకా బతికి ఉన్నాడన డానికి మూలుగు ఒక్కటే గుర్తుగా తెలిసేది. ఎప్పుడయినా మూలుగు వినిపించకపోతే కళ్లు సగం విడిఉన్నా నిద్రపోయే వాడిని చూసి ఊపిరి ఉందో పోయిందో తేల్చుకోలేక ముక్కు ముందు వేలుపెట్టి చూసేది నూకాలు. బతికి బట్టకడితే తను నౌఖరీ చేస్తున్న యింటి యజమాని పేరు 'దొరస్వామి' అని పెట్టాలనుకొంది.కానిపేరుపెట్టేదాకా ఉంటాడా ఊడుతాడా అన్నది ఆమెకీ సందేహంగానే ఉండేది. ఇలా ఉండగా సందువాలులో వున్నా చర్చికి దానియేలు అనే ఫాదర్ వచ్చి ఏసోబు సంగతి విని స్వయంగా పాకకి వచ్చి వాడిని ఆశీర్వదించాడు. "ప్రభువు ఆశీర్వాదం ఉంటుంది. వాడు తినేవన్నీ పెట్టెయ్. బ్రతికితే ప్రభువు పేరు పెట్టుకో." అనేసి వెళ్లిపోయాడు! ఆ తర్వాత— యింకేమీ ఆలోచించలేదు నూకాలు. రొయ్యల పులుసు దగ్గర్నుంచీ, ఉల్లిపాయ యిగురుదాకా చేసినవన్నీ పెట్టేసేది. విచిత్రంగా ఎముకలు పూడుకున్నాయి. శరీరం ఆకారం తేలింది. కళ్లు గుహల్లో దీపాల్లా కాకుండా వాటిలో జీవం కనిపించింది. రెండు మూడు నెల్లో ఏసోబు గుండు లాగ తయారయాడు. శరీరం ఊబగా పెరిగిపోయింది. నూకాలు అన్నం తినిపిస్తూంటేనే సగంలోనే వాళ్ళని నిద్రపోయేవాడు. మళ్లీ తట్టిలేపి ముద్ద నోటికందిస్తే కళ్లు మూసుకునే నోరిప్పేవాడు. తన అవసరాల్ని తన నోటి దగ్గరికీ, తన కాళ్లదగ్గరికీ తెచ్చే గొప్ప శక్తిగా తల్లి ఏసోబు జీవితంలో మిగిలిపోయింది. నిస్సహాయుడైన ఆ కొడుకుని ఆదుకునే అవసరం ఆ తల్లి గుర్తిస్తే తన నిస్సహాయతను దానికి తప్పనిసరిగా దొరికే సమాధానాన్ని ఏసోబు గుర్తించాడు. తన తల్లి కల్పవల్లి. తనకి కావలసినవన్నీ ఆమె చూసిపెడుతుంది. అంతేకాదు. తనకేం కావాలో తెలుసు. ఆమె అన్నం పెడితే అది ఆకలి వేసే సమయం అని గుర్తుపడతాడు ఏసోబు. 'స్నానం చెయ్యాలి' అని తల్లి పిలిస్తే అప్పటికి వేళయిందనుకొంటాడు. స్నానం చెయ్యమనడం ఆమె మరిచిపోతే ఆ రోజు తను స్నానం చెయ్యకూడదని అమ్మ అనుకొని వుంటుంది, లేకపోతే ఎందుకు పిలవదు? వంద పనుల్లో ఉంటూ ఆ విషయం తనకి ప్రత్యేకంగా ఎందుకు చెప్పాలి? అనుకుంటాడు. తల్లి చాలా అందకత్తె. కొప్పున బంతి పువ్వులు ముడుచుకొని పనిలోకివెళ్తే బతకమ్మ విగ్రహంలాగ నిండుగా కనిపించడం చూసి మురిసిపోయాడు.


పెద్దయినకొద్దీ ఏసోబు శరీరం అలా వయిస్సుకి మించి పెరుగుతూనే వచ్చింది. చదువు ప్రసక్తి అమ్మ తీసుకురాలేదు. అతనికీ చదవాలని తెలీదు. తొమ్మిదేళ్లుండగానే ఒక లారీ కంపెనీలో క్లీనర్‌గా పెట్టింది. పని పూర్తయి అమ్మకోసం అక్కడే కాచుకుని వుండేవాడు. సాయంకాలం పనినుంచి వస్తూ కొడుకుని తీసుకుని యింటికి పోయేది. అమ్మ లేకపోతే తన బతుకు ఏమయిపోతుంది? ఆ ఆలోచనకే వణికిపోయేవాడు.

"నువ్వు చచ్చిపోతే నేనూ చచ్చిపోతాను" అని ఓసారి అమ్మతో చెప్పి బావురుమని ఏడ్చాడు. మరో ఆరు నెలలకి నూకాలు చచ్చిపోయింది. ఏసోబుకి అప్పుడే టైఫాయిడ్ వచ్చి రెండు నెలలు మంచం పట్టాడు. మళ్లీ చిన్నతనంలో ఎముకలగూడులాగే అయిపోయాడు. ఏసోబు అక్క దానమ్మ తనయింటికి తీసుకుపోయి వాడిని కంటికి రెప్పలాగ చూసుకుంది. ఆ రెండునెలలూ వాడి నోరుతెరిచి బార్లీ నీళ్లు తాగించడం దగ్గర్నుంచి తడిగుడ్డతో వొళ్లంతా తుడవడం అంతా దానమ్మే స్వయంగా చేసింది. టైఫాయిడ్ నుంచి కోలుకున్నాక మళ్లీ మూడునెలల్లో కొత్త రక్తం పట్టి పులిలా తయారయాడు. దానమ్మ ఏసోబుకి దేవతా మూర్తిలాగ కనిపించింది. దానమ్మ నిండుగా పుష్టిగా అయిదున్నరడుగుల మనిషి. రోడ్డు మీద నడుస్తూంటే శరీరం వూగుతూంటే పువ్వులరథం కదిలివస్తున్నట్లుగా వుండే అక్కని చూసి గర్వపడేవాడు. తన మంచి చెడ్డలు ఆమెకు క్షుణ్ణంగా తెలుసు!

తనకి ఆమె పరపతిని ఉపయోగించి లారీ డ్రైవింగ్ నేర్పించింది దానమ్మ. కష్టపడి లారీ డ్రైవింగ్ నేర్చుకున్నాడు. స్టీరింగు ముందు కూర్చున్నప్పుడు భయంతో పిల్లిలాగ వణికిపోతున్నాడని విని, అక్క స్వయంగా అతని పక్కన కూర్చుని ధైర్యం చెప్పింది. డ్రైవింగ్ ఎలా చెయ్యాలో అప్పారావు నేర్పాడు. పట్టుదలగా ఎలా కూర్చోవాలో అక్క నేర్పింది. అక్క తన పక్కన వుంటే లారీ చిన్న తోపుడుబండిలాగ అనిపించింది ఏసోబుకి. డ్రైవింగ్ పూర్తిగా అలవాటయాక రెండు మూడు ట్రిప్పులకి అక్క కూడా తనతో వచ్చింది. రోడ్డున మేకపిల్ల అడ్డంపడితే ఎలా తప్పించాలో తెలియనప్పుడు అక్కని మనస్సులోకి తెచ్చుకుంటే ఎక్కడలేని ధైర్యమూ వచ్చేది. తను యివాళ మనిషిగా నిలబడడానికి తన అక్కే కారణమని పదే పదే అనుకునేవాడు. అటువంటి సమర్ధురాలి తమ్ముడిగా పుట్టినందుకు గర్వపడేవాడు ఆమె లేకపోతే తన బతుకు ఏమయిపోతుందా అని వాపోయేవాడు.



"నువ్వు లేకపోతే లారీకింద




తలపెట్టి చచ్చిపోతానక్కా" అనేవాడు ఉల్లిపాయ కొరుక్కుని అన్నం తింటూ.

"చీ నోర్ముయ్యరా పిచ్చివెధవా" అని అక్క బుజ్జగించేది. తమ్ముడు మరీ వాన పాములాగ తనని చుట్టుకుపోయి బతుకుతున్నాడని అర్థమయి మల్లికిచ్చి పెళ్లి చేసింది. మల్లి ఉల్లిపొరలాంటి చీరెలు కడుతుంది. మల్లిపువ్వులాగ ఉంటుంది. ఎర్రటి బొట్టు పెడుతుంది. జబ్బలపైదాకా జాకెట్టు వేస్తుంది. వాళ్ల నాన్న మద్రాసు లారీ సర్వీసులో పని చేసేవాడు. కనుక పట్నం అలవాట్లు చాలా మల్లికొచ్చాయి. మల్లి వచ్చాక ఏసోబు జీవితం మూడుపువ్వులూ ఆరు కాయలూ అయింది. తన తమ్ముడిని ఎలా చూసుకోవాలో దానమ్మ మల్లికి నూరిపోసింది. మల్లి అంతా విని ఆకలింపుకి తెచ్చుకుంది. ఏసోబు ఆమె సౌందర్యానికి తలమునకలయిపోయాడు. ఆమె రోజు వేసే తాంబూలానికి ఎర్రపడిన పెదవులు చూసి మత్తెక్కిపోయాడు. జాకెట్టు పికిలిపోయేలాగ మద్రాసీ ధోరణిలో వున్న వక్షోజాల మీద తలపెట్టుకు నిద్రపోతూ తనంతటి అదృష్టవంతుడు లేడనుకునేవాడు ఏసోబు. డ్యూటీలో ఎప్పుడెప్పుడు ఏ పేం చెయ్యాలో అలవాట్లు ఎలా ఉంచుకోవాలో పసివాడికి చెప్పినట్టు బోధపరిచేది మల్లి. ఏసోబుకి మెల్లగా పొగాకు నవలడం నేర్పింది. మొదట వేసుకున్నప్పుడు వాంతి అయి తల తిరిగింది. తనకి సాధ్యంకాని అంత ఘాటయిన పొగాకు నవలకలిగినందుకు భార్యని చూసి పొంగిపోయాడు ఏసోబు. అతనికి కూటు చేసి పెట్టింది. పంజాబీ కుర్తా చేసి పెట్టింది. ఆ రోజుల్లో ఏసోబు మరో పది పౌన్లు పెరిగాడు. బొద్దుగా మళయాళీ మనిషిలాగ మీసాలు పెంచడం నేర్పింది మల్లి. ఆ మీసాల్ని నూనెరాసి తనే స్వయంగా దువ్వేది. కాకీ యూనిఫారం కుట్టించి పూలరంగడిలాగ ఏసోబుని తయారు చేయించింది. షర్టుమీద పిల్లిబొమ్మలూ, పువ్వులూ కుట్టి మిగతా డ్రైవర్లు తనంటే ఈర్ష్యపడేటట్టు చేసింది. మరో కొత్త లోకంలో విహరిస్తున్న ఆనందం అనుభవించాడు ఏసోబు. తను ఆనందంగా ఆరోగ్యంగా ఉండడానికి దేవుడు ప్రసాదించిన అపూర్వమయిన వరం తన మల్లి అనుకొనేవాడు. తన మల్లే లేకపోతే తన బతుకేమయిపోయేదా అని బెంగేలు పడేవాడు. లేదు. మల్లి లేనిదే తన బ్రతుకు లేదు. మల్లి లేకపోతే నలుగురి డ్రైవర్లలాగే తనూ నూనె ఓడుతూ జిడ్డుమొహంతో ఉండేవాడు.

"మల్లి నన్ను వదిలి వెళ్లక. నువ్వు లేనిదే నేను బతకలేనే" అని ఆమె గుండెలమీద తలపెట్టుకుని ఆమె చెవిలో చెప్పేవాడు. ప్రేమ ఎక్కువయి ఆమె ఒడిలో తలపెట్టుకు ఏడ్చేసేవాడు. మల్లి నవ్వి ఏసోబుని గారంగా ఓదార్చేది. ఆ రోజుల్లోనే ఒకసారి బొంబాయి ట్రిప్పు వెళ్లి వచ్చేసరికి మద్రాసు నుంచి బంగాళ దుంపలు వేసుకొచ్చిన లారీ డ్రైవరు ఆర్ముగంతో లేచిపోయింది. ఆర్ముగానికి ఏసోబులాగ బొద్దు మీసాలుంటాయి. ఆర్ముగం ఏసోబులాగ 250 పౌనులు ఉంటాడు. ఆర్ముగం ఏసోబులాగ డ్రైవరు. అయితే ఏసోబు ప్రేమతో ఏడుస్తాడు. ఆర్ముగం ప్రేమ రెచ్చినప్పుడల్లా ఏడిపిస్తాడు.

మల్లి దూరమయాక ఏసోబుకి నడుం విరిగిపోయినట్టయిపోయింది. మిన్ను విరిగి మీదపడ్డట్టు కృంగిపోయాడు. అప్పటికి అక్కకూడా చచ్చిపోయింది. అదిగో, ఆ రోజుల్లోనే మందు తాగటం ఏసోబు అలవాటు చేసుకున్నాడు జీవితమంతా శూన్యమయిపోయింది. రూట్లు తిరగటం మానేశాడు. పాకకి అద్దెకట్టడానికి డబ్బు కరవైపోయింది. తన కింకెవరు దిక్కు. తను ఎవరికోసం బతకాలి. ఒక రోజు నిజంగా ఆత్మహత్య చేసుకుందామని రైలు కట్టదగ్గరికి వెళ్లాడు కాని తన దగ్గర క్లీనర్‌గా పనిచేసే జోగులు తల్లి ముంతమ్మ అతన్ని చూసి ఆపి యింటికి తీసుకొచ్చి గంజి తాగించింది. నాలుగయిదు వారాలకి మనిషిని చేసి పుల్లిని తెచ్చి కట్టబెట్టింది.

పెళ్లినాటికి పుల్లి చీకేసిన మామిడి టెంకలాగ ఉండేది. బుగ్గల్లో నిగనిగ ఉండేది కాదు, కాని ఎక్కడో దాని నవ్వులో అందం, సొట్టపడిన బుగ్గల్లో అందం. దాని తెలివితేటలు అమోఘం. పెళ్లయిన మూడో నాటికే ఏసోబు కష్టాలన్నీ అర్థంచేసుకుంది. ముందు

మానివేస్తే మనిషి మరీ జావయిపోతాడని గ్రహించి డోసుని అదుపులో పెట్టించింది. మధ్యమధ్య తనూ ఓ గ్లాసు లాగేసేది. సుష్టుగా రొయ్యలూ, జెల్లలూ కూరచేసి పెట్టింది. పాత షాహుకారు దగ్గరే లారీ యిప్పించింది. ఏసోబు నెల తిరక్కుండా మనిషయిపోయాడు. ఎండిపోయిన చెట్టు మళ్లీ వేళ్లతన్ని చిగిర్చినట్లు ఏసోబు యింకా నిగనిగలాడుతూ తయారయి పోయాడు. మొక్కల్ని పెంచే తోటమాలి చచ్చిపోయిందన్న మొక్క బతికి పుంజు కుంటే వచ్చే కళలాంటిదేదో పుల్లి ముఖంలో వచ్చింది. పుల్లి సహజంగా అందకత్తైనన్న విషయం అప్పుడు చూపరులకీ ఏసోబుకీ తెలిసొచ్చింది. మల్లి తెలివైనది. వైచాకచాక్యం గలది. పనిమంతురాలు. పుల్లి నిజంగా అంద మైనది. ధక్కామొక్కీలు తిన్నది. పనిమంతురాలు. కమ్మెచ్చు తీర్చినట్లు ఏసోబుని 4 నెలల్లో తీర్చిదిద్దేసి దువ్విన కోడిపింజులాగ తయారుచేసింది. పుల్లి మళ్లీ తనకి కొత్త జీవితం యిచ్చిందని ఏసోబుకి తెలుసు. ఆమెని చూసి నప్పుడల్లా కృతజ్ఞతతో గర్వంతో అతని హృదయిం నిండిపోతుంది. ఆ రోజుల్లో పుల్లికి అతని ఆశ్రయం అయాడన్న విషయం ఏసోబుకి తెలియదు. అక్కర లేదు. కాని పుల్లి మరో నెలరోజులు ఆలశ్యంగా తన జీవితంలో ప్రవేశిస్తే తను ఏమయిపోయేవాడు.

పుల్లి అతనికి వ్యాపారంలో కిటుకు లన్నీ నేర్పింది. తక్కువగా మాట్లా డడం వల్ల ఎక్కువ లాభం వుందని, లారీ యజమానులతో సఖ్యంగా వుండడం వల్ల గిరాకీ పెరిగే అవకాశం ఉందని దూరాభారమయినా నాలుగు రూపాయలు ఎక్కువగా సంపాదించడానికి వెళ్లక తప్పదనీ యిలాంటి బతకనేర్చిన విష యాలు ఏసోబుకి వంటబట్టించింది. పుల్లిని వదిలిపోవడం ఏసోబుకి యిష్టం




లేదు. కాని పుల్లిని సంతోషపెట్టడానికి పుల్లి చెప్పిన పద్ధతులు పాటించాడు. తద్వారా తప్పని సరిగా పుల్లికి దూరంగా వుండక తప్పలేదు. ఆదాయం పెరిగింది. ఏసోబు సంపదంతా పుల్లి శరీరంమీద దిగేశాడు. కంటె, బేసరి, చెవి లోలకులు చేయించుకుంది. ఆమెని ఆనందపెట్ట గలిగినందుకు సంబరపడిపోయి నాడు ఏసోబు.

ఏసోబుకి దూరంగా వుంటూ పుల్లిని ఆనందపరిచే రోజుల్లోనే దూరంగావున్న క్షణాన మాలకొండయ్యతో ఆనందంగా వుండడం పుల్లి అలవాటు చేసుకొంది. డ్యూటీలు ఎక్కువగా చేసి ఏసోబు సంపాదించిన డబ్బుతో ఎరుపు, పచ్చ రాళ్లు పొదిగిన ఉంగరం చేయించి పెట్టింది మాలకొండయ్యకి. పుల్లి జీవితం టాప్‌గేరులో ఉన్న లారీలాగ నడు స్తోంది. కాని తనతో కలిసిఉన్నరోజుల్లో ఏసోబు ప్రతీ విషయానికీ తన మీద ఆధారపడిపోవడం ప్రతీ క్షణం తనని చుట్టుకుపోవడం పుల్లి భరించలేక పోయింది.

ఒకసారి ట్రిప్పు పూర్తిచేసుకుని బ్రిడ్జి దగ్గర లారీ దిగడాన్ని పరాకుగా పుల్లి గమనించలేదు. ఏసోబు తెల్లవారు ఝామున మొహం కడుక్కొనికాలవలోకి దిగినప్పుడు దూరంగా గన్నేరు దుబ్బుల వెనక కదిలిన శరీరాన్ని గమనించాడు. క్రమంగా ఆ శరీరం లేవడం ఆమె పుల్లి కావడం గుర్తుపట్టాడు ఏసోబు. అతని ముఖం చాటంత అయింది. "పుల్లీ" అని గావుకేక పెట్టేశాడు. పుల్లి తుళ్లి పడింది. ఒక్కసారి ఆమెకి వొళ్లంతా నీరయి పోయింది. చెట్లచాటున ఉన్న చింత మొద్దు అక్కడికక్కడ శిలా ప్రతిమ అయిపోయింది. మాలకొండయ్య కదల లేదు. పాలిపోయిన ముఖంతో ఏసోబుని గమనించింది పుల్లి. భయంతో నోరు పెగలక యింటికి పారిపోయింది పుల్లి.

తనని చూసి మాటయినా మాట్లాడక ఎందుకు పారిపోయింది? ఏసోబుకి అర్థంకాలేదు. అంత పొద్దుటే ఎందుకు కాలువ ఒడ్డుకు వచ్చింది. ఆలోచన పోలేదు. ముఖంలో ఎందుకు భయం? అసలు మనస్సు అంతవరకు గుర్తుపట్టనే లేదు. కాని పొద్దుటే పుల్లి కనిపించడం శుభశకునం. ఆనందంగానే యింటికి వచ్చాడు. కాని అంతే ఆనందంగా పుల్లి అతని ఎదుట పడలేకపోయింది. ఏసోబు శరీరం దిట్టంగా విగ్రహం గంభీరంగా ఉంటుందన్న విషయం ఆమెకి అప్పుడర్థ మయింది. మల్లి తిప్పి మెలిపెట్టిన మీసాలు తనని హెచ్చరించినట్లనిపిం

చాయి. మందుకి అలవాటుపడ్డ ఆ కళ్లని చూసినప్పుడు తన శరీరంలోని రక్తం నీరయిపోయింది. ఏసోబు భారీ విగ్రహంలో పిల్లిగుండెకాయ అన్నవిషయం తన 'అవినీతి' మరిపించింది. ఆనందంగా పుల్లీ అని కావలించుకున్నాడు. ఆకులాగ అతని కౌగిట్లో వణికింది పుల్లి. మాలకొండయ్యని నిజంగా చూశాడేమో? చూసి మాట్లాడడేం? మనస్సులో పెట్టుకొని రాత్రి వెళ్లి అతన్ని నరుకుతాడా? తన గుండెల్లో పొడుస్తాడా?

ఆరు రోజుల తర్వాత వచ్చిన ఆనందంతో వాళ్లు మరచిపోయాడు ఏసోబు, ఓ మంచు ముద్ద అతని కౌగిట్లో మిగిలింది. అతని చిరునవ్వు, కల్మషం లేని అతని ముఖం ఆమెని మరింత భయపెట్టింది. అతని శరీరంలో ఊహకి అందని శక్తి వుందని అతనికి తెలీదు. దాన్ని రెచ్చగొట్టడానికి పొద్దున సంఘటన చాలదా? భయంతో సాయంకాలానికి జ్వరం వచ్చింది పుల్లికి. అనుకోకుండా తెల్లవారేసరికి కొత్త ట్రిప్పు కుదిరింది ఏసోబుకి. వెళ్లమని పోరి, ప్రాధేయపడి ఏడ్చి పంపించింది పుల్లి. 'రెండురోజుల పని వెంటనే వచ్చేస్తానని' లారీ ఎక్కాడు. ప్రతిసారీ నాలుగు రోజుల తర్వాత కాని కొత్త ట్రిప్పు వేసుకోడు. ఈ సారి ఒక్క రోజులోనే బండీ ఎక్కాడు. యింట్లో ఉండిపోవాలి అనుకున్నాడు ఏసోబు. పని పూర్తిచేసుకొని ఆ రాత్రికే యింటికి చేరాలని బయలుదేరాడు. అర్ధరాత్రి తలుపుకొట్టి పుల్లిని ఆశ్చర్యంలో ముంచెత్తాలనుకున్నాడు. బ్రిడ్జిమీద చీకటిగా వుంది. హెడ్‌లైట్ల మీద రాళ్లు వేసి కొట్టారు. ఏసోబుకి భయం వేసింది.

"ఏయ్! ఎవరదీ!" అని అరిచాడు. చీకట్లో ఆ నల్లటి శరీరం తనమీద దూకింది. ఏసోబు వణికిపోయాడు. జీవితంలో అందరూ ఆడవాళ్లూ తనని ఆదరించి, సాకి, ప్రేమించినవాళ్లే. కాని దౌర్జన్యాన్ని ఎలా ఎదుర్కొనాలో ఎవరూ చెప్పలేదు. అయినా యితనెందుకు తనమీద పడ్డాడు.

"తమ్ముడూ-ఎవరు నువ్వు? నేనేం తప్పు చేశాను? నా పేరు ఏసోబు" అంటున్నాడు. తన మీద గుద్దుల వర్షం. అతని తోపుకి లారీమీద పడ్డాడు. ఫుట్‌బోర్డు రేకు నుదుటికి గుచ్చుకుని చీరింది.

"పుల్లీ" అని గావుకేక పెట్టాడు. రెండు రోజుల క్రితం యిక్కడే యీ కాలవ అవతలే పుల్లిని చూశాడు తను. ఇప్పుడు పుల్లి అక్కడ ఉంటే తనని రక్షిస్తుంది.

"పుల్లీ! పుల్లీ" అని పిచ్చివాడిలాగ అరిచాడు. పుల్లి ఒక్కతికే తను కావాలి. తనని కాపాడాలంటే ఏంచెయ్యాలో పుల్లికి తెలుసు. ఏడ్చాడు. దెబ్బలు భరించరాని వవుతున్నాయి. ఆ నల్లటి శరీరం బలంగా కొడుతోంది. రోడ్డు మీద పడ్డాడు. "పుల్లి" అని గావుకేక పెట్టాడు.

ఆ చీకట్లోనే ఒక్క క్షణం ఏదో మెరిసింది. నల్లటి శరీరం తన మీద కూర్చుంది. తనకేమయినా అయితే పుల్లేమయిపోతుందో! భగవంతుడా! నా పుల్లిని కాపాడు. దానికే కష్టం రాకుండా చూడు. నేనిలా చచ్చిపోయానంటే గుండె పగిలేలాగ ఏడుస్తుంది. దానికి నువ్వే ఓదార్పు కలిగించు. దాన్ని మళ్ళీ మనిషిని చెయ్యి. దాని దుఃఖం నేను భరించలేను. ఏసోబు హృదయం పుల్లిపట్ల బాధతో, ఆర్తితో విడి రక్తం చిమ్మింది. మెల్లగా నమ్మకంగా గుండెల్లోకి కత్తి దిగింది. తనకి జరగబోయే నష్టాన్ని మరిచిపోయి, పుల్లికి జరగబోయే కష్టాన్ని గురించిన ఆలోచన ఏసోబు హృదయాన్ని కత్తి కంటే ముందుగానే చీల్చేసింది. "పుల్లీ!" అన్న ఆఖరి పిలుపు. ఆ పిలుపులో నీరసం, భయం, సూచనగా కనిపించే మృత్యుభయం. కాలవ అవతలి గట్టున రెండు రోజుల క్రితం ఏసోబుకి కనిపించిన చోటే నిలబడివున్న పుల్లికి వినిపించాయి. ఆమె ప్రశాంతంగా నిట్టూర్చింది.

